
సాక్షి ఒడిశా
సోమవారం । 22 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 5,92,055
బంగారం	950 మిల్లీ గ్రాములు
వెండి	6 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



చెక్కల రవాణాకు చెక్

కలప అక్రమ రవాణాను అటవీ అధికారులు అడ్డుకున్నారు. భారీ ఎత్తున దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



ఆకట్టుకున్న నాటకాలు

గంజాం సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక ప్రదర్శనలు అలరించాయి.

- 8లో

మంగళకరమౌ నీ రాక..!

- రాష్ట్రంలో మార్మోగుతున్న రామనామం
- ఎక్కడ చూసినా 'అయోధ్య' సందడే
- వీధుల్లో శ్రీరాముని పతాకాలు
- వాడవాడలా కాషాయ తోరణాలు
- రామ మందిర నిర్వాహకుల ఊరేగింపులు



జయపురం: శ్రీరామాంజనేయ మందిరం ఆధ్వర్యంలో రాముని ఊరేగింపు ఉత్సవం

జయపురం/కొరాపుట్/రాయగడ/భువనేశ్వర్: అయోధ్యలో సోమవారం రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఒడిశాలోనూ పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా అయోధ్య ముచ్చట్లే వినిపిస్తున్నాయి. ఏ వీధి చూసినా రాముని జెండా దర్శనమిస్తున్నాయి. ఈ వాడకు వెళ్లినా కాషాయ తోరణాలే స్వాగతమిస్తున్నాయి. జయపురం పట్టణం కాషాయం రంగు అలముకుంది. అన్ని మార్గాల్లోనూ కాషాయ తోరణాలు రెపరెపలాడుతున్నాయి. శ్రీరామ కీర్తనలు, భజనలతో భక్తులు సంకీర్తనలు ఆలపిస్తున్నాయి. జయపురంలోని హిందూ సమాజ్, జమాల్ లైన్ శ్రీరామాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపులు, వ్రతాలు నిర్వహించారు. శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు చేపట్టారు. పట్టణంలో అతి పురాతన రఘునాథ్ మందిరం ప్రత్యేక అలంకరణతో ఆకట్టుకుంటోంది. నబరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాల వ్యాప్తంగా హిందూ సంస్థలు అలంకారాలతో సందడి చేస్తున్నాయి. ప్రతి జంక్షన్‌లో భారీ ఎత్తున రామచిత్ర పటాలను ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ వాహినీ, ఏక్తా వాహినీ, ఏకలవ్య సంఘటన్ తదితర సంస్థల ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా ప్రతి ఇంటా సోమవారం సాయంత్రం దీపాలు వెలిగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రమిదలకు గిరాకీ పెరిగింది. రాయగడ మెయిన్‌రోడ్డులో కుమ్మర్ల వద్ద పెద్ద ఎత్తున ప్రమిదలు అమ్ముడుపోయాయి. అయోధ్య శ్రీరామ ఆలయ ప్రాణప్రతిష్ట సందర్భంగా అంతర్జాతీయ సైకత కళాకారుడు, యానిమేటర్ మానస్ కుమార్ సాహు ఈ సైకత యానిమేషన్ చిత్రాన్ని రూపొందించాడు. 5 నిమిషాల 34 సెకన్ల నిడివి ఉన్న యానిమేషను వీడియో చిత్రీకరణకు దాదాపు 20 గంటల సమయం శ్రమించాడు.



జయపురం: హిందూసమాజ్ ప్రదర్శనలు



కొరాపుట్: దమంజోడి వద్ద శ్రీరాముడి ఫ్లెక్సీ

15 రోజులు.. లక్ష ప్రమిదలు

- లక్ష ప్రమిదలు చేసిన బలరాం కుంభారి

జయపురం: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్టాపన సందర్భంగా ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చిన సందర్భంగా జయపురం సమితి కుంభారిపుట్‌కు చెందిన బలరాం కుంభారి లక్ష ప్రమిదలు తయారు చేసి ఆదర్శంగా నిలిచారు. జయపురం పట్టణ ప్రజలకే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు ప్రమిదలు సమకూర్చేందుకు 15 దినాలుగా రాత్రింబవల్లు శ్రమిస్తూ లక్షకు పైగా ప్రమిదలు తయారు చేసి ఎటువంటి లాభం ఆశించకుండా ప్రజలకు అందజేసి శ్రీరాముని పట్ల తన భక్తిని చాటుకున్నారు.



లక్షకు పైగా ప్రమిదలు తయారు చేసిన బలరాం కుంభారి

72 ఏళ్లు.. 42 లక్షల రామనామాలు

- రామభక్తిని చాటుకున్న వృద్ధురాలు బ్రజకిశోరీ సాహు

జయపురం: అయోధ్య రాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా భక్తులు పలు రకాలుగా తమ భక్తిని చాటుకుంటున్నారు. జయపురం పోస్టాఫీసు సందువీధిలో నివాసముంటున్న 72 యేళ్ల వృద్ధురాలు బ్రజకిశోరీ సాహుకు రాముడంటే ప్రాణం. ఏకంగా 42 లక్షల రామనామాలు రాసి శ్రీరామునికి అంకితం చేసింది. తన 52వ ఏట ప్రారంభించి ప్రతిరోజూ 1040 శ్రీరామ నామాలు రాస్తూ గత 20 ఏళ్లలో 42 లక్షల శ్రీరామనామాలు రాసి భక్తిచాటుకున్నారు. తాను జీవించి ఉన్నంత వరకు శ్రీరామ నామాలు రాస్తూనే ఉంటానని ఆమె వెల్లడించారు. తాను రాసిన రామనామ పుస్తకాలు అయోధ్య శ్రీరాముని చెంతకు చేరాలని తన కోరికగా కుమారుడు లింగరాజుకు తెలియజేశారు. 20 ఏళ్ల కిందట భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిని చూసిన తనయుడు లింగరాజు బరంపురం నుంచి రామనామ పుస్తకాలు తీసుకొచ్చి అప్పగించాడు. అప్పటి నుంచి ఆమె రామనామం రాయటం ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీరామ నామాలు రాస్తుంటారు.



42 లక్షల శ్రీరామనామాలు రాసిన బ్రజకిశోరి సాహు



జయపురం: పట్టణంలో కాషాయ తోరణాలు



జయపురం: ముస్తాబైన జయపురంలో శ్రీరఘునాథ్ మందిరం



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో శ్రీరామ చిత్రపటాల ఏర్పాటు



రాయగడ: ప్రమిదలు కొనుగోలు చేస్తున్న స్థానికులు



భువనేశ్వర్: సైకత ప్రాణప్రతిష్ట మహోత్సవం



భువనేశ్వర్: సైకత యానిమేషన్ వేస్తున్న మానస కుమార్ సాహు

న్యూస్‌రీల్

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతి చెందిన సత్య బోత్ర

కొరాపుట్: విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతిచెందింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కొడింగాలో 11 కేవీ విద్యుత్ లైన్ తెగిపడినా సరఫరా నిలుపుదల చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. ఇదే సమయంలో సత్య బోత్ర(40) అనే మహిళ అనుకోకుండా తీగను తాకారు. వెంటనే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కొడింగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

నదిలో మునిగి యువతి మృతి



సుకాంతి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రాయగడ: నదిలో స్నానానికని వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి యువతి మృతి చెందిన ఘటన రాయగడ జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి ఎరెండా గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. బుడాగుడ పంచాయతీ గురుతులి గ్రామానికి చెందిన సుకాంతి సరక(25) ఆదివారం తన భర్త కామ సరకతో పనిమీద బయటకు వెళ్లారు. ఉదయం పది గంటల సమయంలో ఎరెండా గ్రామ సమీపంలో నదిలో స్నానం చేసేందుకు దిగింది. ఒక్కసారిగా మూర్ఛరోగం రావడంతో నీట మునిగి ఊపిరాడక మృతి చెందింది. నది ఒడ్డున ఉన్న భర్త వెంటనే వెళ్లి బయటకు తీసేసరికే మృతి చెందింది. బంధువులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు



గాయపడిన రాధమ్మ

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి ఇంతాలిగుడ గ్రామంలో బైకు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంతాలిగుడ గ్రామానికి చెందిన అప్పారావు కద్రక, అజయ్ కులిసికలు బైకుపై వెళ్తూ అదే మార్గం నుంచి రాధమ్మ హికకను అదుపు తప్పి ఢీకొట్టారు. ఈ ఘటనలో రాధమ్మ తీవ్ర గాయాలు కావడంతో కళ్యాణ సింగుపూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి యువకులను అదుపులోకి తీసుకున్నారు.

50 కిలోల గంజాయి సీజ్



కారులో గుర్తించిన గంజాయి

బరంపురం: కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి హరిచందన్ సమంతరాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం వేకువజామున 5 గంటల సమయంలో గంజాం జిల్లా అస్కా పట్టణం నుంచి బరంపురం వైపు వస్తున్న కారులో అక్రమంగా గంజాయి రవాణ అవుతున్నట్లు సమాచారం అందడంతో బరంపురం అబ్కారీ అధికారులు దిగపండి- బరంపురం మధ్య నిఘా వేశారు. ఫస్ట్ గేట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కారు ఆపి తనిఖీ చేయగా 2 బస్తాల్లో 50 కిలోల గంజాయి గుర్తించారు. కారును స్వాధీనం చేసుకొని గంజాం జిల్లా పత్రపూర్ బ్లాక్ సింగిపూర్ గ్రామానికి చెందిన నిరంజన్ ప్రధాన్, సాషన్‌పూర్ గ్రామానికి చెందిన అభిషేక్ కుమార్ తివారిని అరెస్టు చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

రాయగడ: యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలని, ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక సాయిప్రియనగర్‌లో సాయిప్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ క్రీడారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందని చెప్పారు. టోర్నీ నిర్వాహకుడు కామినేని సతీష్‌కుమార్ మాట్లాడుతూ వారంపాటు జరగనున్న ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన నెక్కంటి భాస్కరరావు

23న వి.కె.పాండియన్ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి బసంత్ దాస్

పర్లాకిమిడి: రాష్ట్ర అమొ ఒడిశా..నవీన్ ఒడిశా క్యాబినెట్ మంత్రి వి.కె.పాండియన్ ఈ నెల 23న గజపతి పర్యటన సందర్భంగా పర్లాకిమిడి స్టేడియంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్లాకిమిడి మెడికల్‌లో వివిధ అభివృద్ధి పథకాలు, బ్లాక్ స్థాయి పథకాలను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక బీజేడీ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు బసంత్‌దాస్ అధ్యక్షతన ఆదివారం ముందస్తు సమావేశం నిర్వహించారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, రూపేష్ పాణిగ్రాహి, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, యువజన నాయకులు శాసనం లింగరాజు, సాధారణ కార్యదర్శి మారుత్ పాలో తదితరులు హాజరయ్యారు. గజపతి జిల్లాకు ఏడు సమితి కేంద్రాల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ అనేక అభివృద్ధి పథకాలకు నిధులు మంజూరు చేశారని, ప్రతి గ్రామ పంచాయతీలో చర్చిలు, రోడ్లు, మండపాలు నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర పథకాలు లక్ష్మీబస్, బిజూ స్వస్థ్య ఆరోగ్య పథకం, ఇతర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న జరగనున్న పాండియన్ పర్యటనను విజయవంతం చేయాలని బసంత్‌దాస్ పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేడీ ఛత్ర సంఘం నాయకులు త్రిపాఠి, పట్టణ బీజేడీ అధ్యక్షుడు సిత్తు మహాపాత్రో, అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు ఎన్ని గోపి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్ వాహనాలకు కళ్లెం

జయపురం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారిని జయపురం పోలీసులు అడ్డుకున్నారు. శనివారం రాత్రి పారాబెడ, గోపబంధునగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన 60 ద్విచక్ర వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. మరోసారి ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గజమోహన్ కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కొండబాబు

రాయగడ: ఒడియా టీవీ చానెల్ జర్నలిస్ట్ గజమోహన్ గరడియా అకాల మృతికి చింతిస్తూ బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు ఆదివారం కళ్యాణసింగుపూర్‌లో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. పిల్లల చదువుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేడీ యువ నాయకుడు కొండాబత్తుల శ్రీనివాస్, న్యాయవాది బిరజా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

20 మంది పోలీసులకు గవర్నర్ పోలీసు పతకాలు

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఒడిశా ప్రభుత్వం 2024 సంవత్సరానికిగాను గవర్నర్ పోలీస్ పతకాలను ప్రదానం చేసేందుకు అధికారులు, సిబ్బందిని ఎంపిక చేశారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్ జనరల్‌తో 20 మంది పోలీసులు పతకాలు అందుకోనున్నారు. ఏడు వేర్వేరు విభాగాల్లో సిబ్బందిని ఎంపిక చేసి గవర్నరు పోలీసు పతకానికి ఖరారు చేశారు.

1. హిమాన్షు కుమార్ లాల్(ఐజీ ఆఫ్ పోలీస్, తూర్పు రేంజ్, బాలాసోర్)
2. షెఫీన్ అహమ్మద్ ఖాన్(ఐజీ ఆఫ్ పోలీస్, సీఐడీ, సీబీ, ఒడిశా, కటక్
3. జగ్మోహన్ మీనా(ఎస్పీ గంజాం)
4. మానస్ రంజన్ గొడొనాయక్(ఎస్పీ సంబల్‌పూర్)
5. ఉదయభాను మిశ్రా(ఏఎస్పీ, బీపీఎస్‌పీఏ, భువనేశ్వర్)
6. మానస్ రంజన్ గొడొనాయక్(ఏసీపీ, యూపీడీ, భువనేశ్వర్)
7. అనిలా ఆనంద్(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సీఐడీ, సీబీ, ఒడిశా, కటక్)
8. సవ్యసాచి మల్లా, (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పట్టాపూర్ పోలీస్ స్టేషన్, గంజాం)
9. హేమ మాలిని నాయక్(ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్, సంబల్‌పూర్ డివిజన్)
10. దిలీప్ కుమార్ నాయక్, (ఎస్‌ఐ (సాయుధ) ఏఎస్పీ, 4వ బెటాలియన్, రౌర్కెలా)
11. జుగల్ చరణ్ స్వంయి(ఎస్‌ఐ, యూపీడీ, భువనేశ్వర్)
12. సంజయ కుమార్ పట్నాయక్(విజిలెన్స్ ఎస్‌ఐ, సంబల్‌పూర్ డివిజన్)
13. బికాష్ కుమార్ పాత్రో (ఎస్‌ఐ(కమ్యూనికేషన్), ఒడిశా పోలీస్, సిగ్నల్ ఎస్టాబ్లిష్‌మెంట్)
14. ప్రజాపతి మెహర్, (సహాయ ఎస్‌ఐ, స్పెషల్ బ్రాంచ్, ఒడిశా, భువనేశ్వర్)
15. ప్రశాంత కుమార్ బిస్వాల్(డ్రైవర్ హవల్దార్, పూరీ)
16. రమేష్ కుమార్ సాహు(కానిస్టేబుల్, (ఓఆర్), కలహండి)
17. సనాతన్ సాహు, (కానిస్టేబుల్, విజిలెన్స్ డైరెక్టరేట్, కటక్)
18. నరేష్ కుమార్ చౌదరి(కానిస్టేబుల్, ఝార్సుగుడ)
19. బిశ్వకర్మ ముండా(సిపాయి - 499 ఎస్, ఓఎస్‌ఏపీ, 4వ బెటాలియన్, రౌర్కెలా)
20. కేదార్ నాథ్ మిశ్రా(సిపాయి సువేదార్, స్పెషల్ బ్రాంచ్, భువనేశ్వర్)

వెంకన్నకు విశేష పూజలు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లో కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పౌష్యమాస శుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు భాస్యరాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు ఆచరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.



పూజలందుకుంటున్న స్వామివారు

క్లుప్తంగా

అప్సా జిల్లా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



అప్సా జిల్లా కార్యవర్గ సభ్యులు

గార: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. శాలిహుండం కొండపై జిల్లా శాఖ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ వి.సుందరరామ్, కో చైర్మన్ ఎం.రవీంద్రల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గార మండలం శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ కొర్లాం అప్పలాచార్యులును అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మామిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఈగల వేణు, కోశాధికారిగా బెవర హరినారాయణ, ఉపాధ్యక్షుడిగా పులగాన సూరారెడ్డి, కార్యదర్శిగా నౌపాడ రామారావు, పీఆర్ఓగా కొత్తకోట శ్రీరామమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ కో ఆర్డినేటర్ ఎం.రామ్‌మనోహరరావు, రాష్ట్ర సభ్యులు మెట్ట జనార్ధనరావు, తమ్మినేని సింహాచలం, పి.భాస్కరరావు, ఇలపండ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరాలకు కార్తీక్ ఎంపిక



కార్తీక్‌ను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి. పక్కనే అర్జున్ రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎం.కార్తీక్ జాతీయ పోటీల శిక్షణ శిబిరాలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఏపీ బాస్కెట్‌బాల్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి నుంచి జిల్లా సంఘానికి వర్తమానం అందింది. నేషనల్ మీట్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాస్కెట్‌బాల్ ప్రాబబుల్స్ జట్టుకు 20 మందితో కూడిన క్రీడాకారుల జాబితాను ప్రకటించగా చేయగా.. అందులో శ్రీకాకుళం నుంచి ఎం.కార్తీక్‌కు చోటు లభించింది. ఈ శిక్షణా శిబిరాలు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం వేదికగా ఈనెల 22వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. శిక్షణ శిబిరాలకు కార్తీక్ ఎంపిక కావడంతో శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆదివారం మండల వీధిలోని తన నివాసంలో కార్తీక్‌ను అభినందించారు. రానుపోను ఖర్చుల కోసం అవసరమైన సాయాన్ని అందించారు. ఈ శిక్షణ శిబిరాల్లో ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టు ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లోని కిస్ యూనివర్సిటీ వేదికగా ఫిబ్రవరి 4 నుంచి జరగనున్న 73వ ఆలిండియా నేషనల్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటుంది. కార్తీక్‌ను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.విపద్మావతి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, సంఘ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

లెనిన్‌కు ఘనంగా నివాళి



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా పోరాటాలకు మార్క్సిజాన్ని అనువర్తింపజేసి, శ్రమజీవులందరినీ విప్లవ పథాన నడిపించిన ఘనత లెనిన్‌దని సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయం క్రాంతి భవన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గ రహిత, దోపిడీ రహిత సమాజం కోసం లెనిన్ ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డోల శంకరరావు, చిక్కాల గోవిందరావు, మొజ్జాడ యుగంధర్, పట్టణ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం



కాలిబూడిదైన పూరిళ్లు

జలుమూరు: అంధవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన జావాన అసిరిపోలు, జావాన కృష్ణ, జావాన లక్ష్మి, జమ్మి రమణమ్మలకు చెందిన ఇళ్లు కాలిబూడిదయ్యాయి. రాత్రి పూట ప్రమాదం జరగడంతో కారణం తెలియరాలేదు. ముందుగా జావాన అసిరిపోలు ఇంటిలో మంటలు ప్రారంభమై వరుసగా ఉన్న ఇళ్లకు వ్యాపించాయి. దుస్తులు, ఇంటి సామాన్లు భద్రపరచగలిగామని, తిండి గింజలు, కొద్దిపాటి వంట సామగ్రి కాలిపోయాయని బాధితులు తెలిపారు. నరసన్నపేట ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు అదుపు చేసింది. వీఆర్వో గోపి ప్రమాద బాధితులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

చెక్కల రవాణాకు చెక్

- కలప మాఫియాపై అటవీ అధికారుల ఉక్కుపాదం
- లక్షలాది రూపాయల విలువైన దుంగలు స్వాధీనం
- పరారీలో అక్రమ రవాణాదారులు



కళ్లికోట్ కొన్నాయ్‌పూర్‌లో స్వాధీనం చేసుకున్న కలప దుంగలు



కళ్లికోట్ అటవీ ప్రాంతంలో నిల్వ చేసిన కలప



కున్నపపూర్‌లో స్వాధీనం చేసుకున్న దుంగలు



రవాణాకు సిద్ధంగా ఉంచిన కలప

బరంపురం: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఓవైపు ప్రభుత్వం వన మహోత్సవాలు నిర్వహిస్తుంటే.. మరోవైపు కలప అక్రమ రవాణాదారులు మాత్రం రెచ్చిపోతున్నారు. అడవుల్లో చొరబడి ఎక్కడికక్కడ భారీ వృక్షాలను నేల కూల్చుతూ మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా అటవీ శాఖ అధికారులు కలప మాఫియాపై దాడులు చేపట్టింది. కళ్లికోట్‌లోని కన్నరియాబడి అటవీ ప్రాంతంలో రవాణాకు సిద్ధంగా ఉన్న లక్షలాది రూపాయల విలువైన దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు వస్తున్నారన్న సమాచారం ముందే తెలియడంతో అక్రమ రవాణాదారులంతా పరారయ్యారు.

సైన్స్‌మేళాతో విజ్ఞానం



సౌరశక్తి ప్రాజెక్టును పరిశీలిస్తున్న అతిథులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సెంట్రల్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సంక్రాంతి– సాంస్కృతిక, శాస్త్రీయ ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులు పలు ప్రాజెక్టులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. సౌరశక్తికి సంబంధించిన ప్రాజెక్టు ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కైలాష్ మీనా, సిబ్బంది అమిత్ దాస్, అరవింద్ కుమార్, హరిషికేష్, శేఖర్, మల్కన్‌గిరి కాలేజ్ సైన్స్ ప్రొఫెసర్ హిమాష్ శేఖర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



'శాముఖ సమాధి' నాటికలో ఓ సన్నివేశం



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



వేదికపై ప్రజాప్రతినిధులు

బరంపురం: స్థానిక హిల్‌పటాన్ మెయిన్‌రోడ్డులోని గంజాం సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమారోహ సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రాలయ, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక, సంగీత శాఖ సంయుక్త నిర్వహణలో శనివారం రాత్రి 16వ రాష్ట్ర స్థాయి నాటక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌చంద్ర చావ్ పట్నాయక్ ముఖ్య అతిథులు పాల్గొని ప్రదర్శనలు ప్రారంభించారు. నయాగఢ్ కళాకారులు ప్రదర్శించిన 'శాముఖ సమాధి' నాటకం ఆలోచింపజేసింది. ఎన్నికల్లో రాజకీయ నాయకుల హామీలు, ప్రజలు మోసపోయే విధానాన్ని కళాకారులు చక్కగా అభినయించారు. భువనేశ్వర్‌కు చెందిన 'మూ గ్రామ సహారో' నాటిక అబ్బుర పరిచింది. కార్యక్రమంలో అధ్యక్షుడు అనిల్ కుమార్ పాత్రో, కార్యదర్శి మెహర్ త్రిపాఠి, సహాయ కార్యదర్శి శంకర్షణ్ సబత్, ఉపాధ్యక్షుడు ఉపేంద్ర కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం..
పర్యాటకాన్ని కాపాడదాం



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న అటవీ సిబ్బంది, విద్యార్థులు



గండాహాతి జలపాతం వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పర్లాకిమిడి: ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అసిస్టెంట్ కన్జర్వేటర్ (ఏసీఎఫ్) అశోక్‌కుమార్ బెహరా పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ ఆదేశాల మేరకు రాయగడ సమితి గంగాబడ పంచాయతీ గండాహాతి జలపాతం వద్ద ఆదివారం ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. బరంపురం స్వచ్ఛంద సంస్థ 'సోబుజా వాహినీ' బృందం, డెంగాస్కల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సాయంతో జలపాతాలు, పరిసర ప్రాంతాల వద్ద ప్లాస్టిక్ బోటిల్స్, సంచులు ఏరివేసి పరిసరాలను శుభ్రం చేశారు. పర్యాటకులకు చైతన్య పరిచేందుకు బుర్రకథ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవగిరి అటవీరేంజ్ అధికారి ఎన్.డి.శర్మ, కాశీనగర్ అటవీ అధికారి సుధీర్ కుమార్ బెహరా, కార్యదర్శి ఏ.ప్రకాష్, పి.వినోద్, గణేష్ పాణిగ్రాహి, డెంగాస్కల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రోహిత్ కుమార్ పొలాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్స్



శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో ఎన్.సి.సి.క్యాడెట్స్ రిహార్సల్

పర్లాకిమిడి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పర్లాకిమిడిలో శ్రీకృష్ణ చంద్ర గజపతి కళాశాల మైదానంలో వివిధ పోలీసు పదాతి దళాలు, ఎన్.సి.సి.క్యాడెట్స్, బాయ్ స్కౌట్స్, నావెల్ స్టూడెంట్స్ ఆదివారం ప్రాక్టీస్ చేశారు. మహారాజా బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సరస్వతీ శిశు మందిర్, కేంద్రియ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు. అదనపు ఎస్పీ అరుణ్ మహంతి, మూడో బెటాలియన్ కమాండెంట్ పర్యవేక్షించారు.



రిపబ్లిక్ డే పరేడ్ ప్రాక్టీసు చేస్తున్న విద్యార్థులు

పథోత్సవ ఉత్సాహం

బాలల కేరింతలు, ఆకట్టుకునే విన్యాసాలు, అబ్బురపరిచే వేషధారణలు, శాస్త్రీయ, ఆధునిక సంగీత, నృత్య ప్రదర్శలు, యోగా, చిత్రలేఖనం.. ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో నగర వీధులు కళకళలాడాయి. ఆదివారం ఉదయం పూట నిర్వహించిన పథోత్సవం ఉర్రూతలూగించింది. పెద్ద సంఖ్యలో నగరవాసులు ఉదయం చల్లటి వాతావరణంలో ఆటపాటల్లో తేలిమునిగారు. స్థానిక పాఖొరిపుట్ ప్రాంతం కళాభూమి నుంచి మధుసూదన్ దాస్ పార్క్ వరకు వివిధ కార్యక్రమాలు నగరవాసుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

– భువనేశ్వర్



బాలల కేరింతలు



నగర వీధుల్లో శంఖ ధ్వని



నడివీధిలో బాలల విన్యాసాలు



అబ్బురపరిచిన విచిత్ర వేషధారణ



ఆబాలగోపాలం ఆనంద హేల



గగుర్పొడిచిన విన్యాసం



పథోత్సవంలో బాలల స్కేటింగ్

కొత్తపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మందస: కొత్తపల్లి సమీపంలో గల రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మందస–బారువ రైల్వేస్టేషన్ మధ్య కొత్తపల్లి గ్రామం సమీపంలోని మహేంద్ర తనయ నదిపై ఉన్న బ్రిడ్జికి ఆనుకుని మృతదేహం పడి ఉండడంతో పలాస రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వివరాలు లభించలేదు. రైలు నుంచి జారిపడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. పలాస జీఆర్పీ ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'ఎప్పటికీ వైఎస్ జగన్‌కే మా మద్దతు'



కవిటి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్‌తో నెలవంక పంచాయితీ పార్టీ శ్రేణులు

కవిటి: గ్రామంలోని సమస్యలపై చర్చించేందుకు వెళ్తే తమకు టీడీపీ కండువాలు వేశారని, కానీ తాము ఎప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికే మద్దతు ఇస్తామని నెలవంక పంచాయతీకి చెందిన పలువురు కార్యకర్తలు తెలిపారు. నెలవంక పంచాయతీలో వైఎస్సార్‌సీపీ క్యాడర్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇందులో వారి అభిప్రాయాలు తెలుసుకున్న మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ వారందరికీ తాను అన్ని వేళల్లోనూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ అన్నివిధాలుగా ఆదుకుంటుందని కడియాల ప్రకాష్ వారికి తెలిపారు. దీనిపై స్పందించిన కార్యకర్తలు దుక్క చిరంజీవి(పెద్దరెడ్డి), కర్రి శంకర్, దుక్క జోగారావు, కొరికాన కృష్ణారావు, కొరికాన ప్రకాష్, దుక్క వెంకటరావు, నీలాపు దేవరాజు, దూగాన ఆదయ్య తదితర 30 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ పార్టీలోనే కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు ఏఎంసీ వైస్ చైర్మన్ వై నీలయ్య, వ్యవసాయసలహామండలి కన్వీనర్ దువ్వు కృష్ణారెడ్డి,సర్పంచ్ భర్త కుమార్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనదారు మృతి



పవన్‌కుమార్ మృతదేహం



బవిరెడ్డి పవన్ కుమార్(ఫైల్)

పాచిపెంట: మండలంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మండల కేంద్రానికి చెందిన బవిరెడ్డి పవన్‌కుమార్ (25) మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్సై నారాయణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి సాలూరు నుంచి స్వస్థలమైన పాచిపెంట మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తున్న పవన్‌కుమార్ పాచిపెంట పోలీస్ స్టేషన్ సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలైన పవన్‌ను సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మరణించాడు. బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పవన్ తమకు అందివస్తాడని భావించిన భావించిన తల్లిదండ్రులు కుమారుడి మరణంతో కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..



జగన్నాథరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని గాజులరేగకు చెందిన బొండపల్లి జగన్నాథరావు (33) రైలు ఢీకొని ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటనపై జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథరావు రైల్వే ట్రాక్ దాటుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జగన్నాథరావు నెల్లిమర్లలోని ఓ మెకానిక్ షెడ్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ తెలిపారు.

53 మద్యం సీసాలు స్వాధీనం

బొండపల్లి: మండలంలోని ముద్దూరు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న53 మద్యం బాటిల్స్‌ను ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎసై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మద్యం విక్రయిస్తున్న బాలి తారకేశ్వ్రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

వల్లూరులో 200 బాటిల్స్



నెల్లిమర్ల రూరల్: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌తో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలవ్యాప్తంగా మద్యం బెల్ట్ షాపులపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. నిత్యం తనిఖీలు చేపడుతూ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం వల్లూరు జంక్షన్‌లో బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 200 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రామగణేష్ తెలిపారు.

నరయ్యవలసలో.. 27 మద్యం బాటిల్స్

దత్తిరాజేరు: మండలంలోని సరయ్యవలస వద్ద అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 27 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష ఆదివారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.

అయోధ్యలో తప్పెటగుళ్ల ప్రదర్శన



తప్పెటగుళ్లు ప్రదర్శన ఇస్తున్న బృందం

మక్కువ: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన కళాకారులు తప్పెటగుళ్ల ప్రదర్శన ఇస్తున్నారు. ఈనెల 18 నుంచి 22వతేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తప్పెటగుళ్ల బృందం గురువు అల్లు వెంకటరమణ తెలిపారు. అయోధ్యలో ఇలా ప్రదర్శనకు అవకాశం రావడంపై పార్వతీపురం మన్యం జిల్లా వాసులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు శంబర పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



- రాత్రి 11 గంటల ప్రాంతంలో గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తులు ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం జరగనుంది. జాతరకు ఇతర జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతో జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పార్వతీపురం ఏఎస్పీ సునీల్‌షొరేన్ పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ, డీఎల్‌పీఓ బి.సత్యనారాయణ, సీఐ ధనుంజయరావు, ఎస్ఐ నరసింహమూర్తి జాతర ఏర్పాట్లు ఆదివారం పరిశీలించారు.

700 మందితో పోలీస్ బందోబస్తు

శంబర పోలమాంబ అమ్మవారి జాతరను డ్రోన్స్ సహాయంతో, స్టాట్యూట్ కెమెరాలతో ఒకే కంట్రోల్ రూమ్ నుంచి మోనటరింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతరలో ఏఎస్పీతో పాటు, నలుగురు డీఎస్పీలు, 15మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, హోంగార్డులు, ఆర్మ్‌డ్ ఫోర్స్, క్లూస్ టీం, క్రైం పార్టీ, రోప్ పార్టీ, సేవాదళ్(పోలీస్‌మిత్ర), మహిళా పోలీసులతో సుమారు 700మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. వనంగుడి వద్ద పోలీస్ సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు.

70వేల లడ్డూ ప్రసాదం తయారీ

భక్తులకు ప్రసాదాన్ని అందించేందుకు ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో తొలి జాతరలో 30వేలు లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారు. మిగిలిన తొమ్మిది వారాలకు మరో 40వేల లడ్డూ తయారు చేయనున్నారు. భక్తులకు అవసరమైన మేరకు పులిహోర ప్రసాదాన్ని తయారుచేశారు. దేవదాయ శాఖ సిబ్బంది 100మంది విధులు నిర్వహించనున్నారు. ప్రసాదాల కౌంటర్లు వనంగుడి వద్ద ఒకటి, చదురుగుడి ఆలయం సమీపంలో రెండు, వైఎస్సార్ విగ్రహం వద్ద ఒకటి ఏర్పాటు చేశారు. వనంగుడి వద్ద, ప్రధానాలయం వెనుక ఉచితం, ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాల్టీల నుంచి మూడు తాగునీటి ట్యాంకర్లను తీసుకువచ్చారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చిడి గదులను ఏర్పాటు చేశారు.

నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలు

శంబర గ్రామం నలువైపులా నాలుగుచోట్ల వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా శంబర గ్రామానికి చేరుకునే వాహనాలను జడ్పీహెచ్ఎస్ సమీపంలో, చెముడు మీదుగా వచ్చిన వాహనాలు గోముఖీ బ్రిడ్జ్ వద్ద, మామిడిపల్లి మీదుగా వచ్చిన వాహనాలకు వీఆర్ఎస్ ప్రాజెక్ట్ వద్ద, మావుడి నుంచి ఎస్.పెద్దవలస మీదుగా వచ్చిన వాహనాలను గ్రామం శివారులో వాహన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకు దేవదాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలో 41 ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాతో జాతర పరిశీలించనున్నారు. ఆరు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

నాలుగు చోట్ల వైద్య శిబిరాలు

గ్రామంలోని వనంగుడి వద్ద, చదురుగుడి క్యూలైన్లు, అంగన్‌వాడీ కార్యాలయం వద్ద, పీహెచ్‌సీ వద్ద నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వైద్య శిబిరం వద్ద మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సిబ్బంది ఉంటారు. గ్రామంలో 120మంది పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు.

జాతరకు 150 బస్సులు

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం నుంచి బుధవారం వరకు సుమారు 150 బస్సులను ఆర్టీసీ నడపనుంది. సోమవారం సుమారు ఏడు డిపోల నుంచి 40బస్సులు నడపనున్నారు. మంగళవారం సిరిమానోత్సవం సందర్భంగా భక్తులు సౌకర్యార్థం పార్వతీపురం, సాలూరు, ఎస్.కోట, శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, విజయనగరం డిపోల నుంచి బస్సులను నడపనున్నారు.

రాత్రి 11గంటలకు గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర

శంబర గ్రామం సమీపంలో గూండాం కొండ సమీపంలో సేకరించిన సిరిమాను కర్ర, బట్టివలస గ్రామం సమీపంలో గుజ్జుమాను కర్రను గ్రామానికి చెందిన రైతులు గుర్తించి, ఆదివారం పశువులేర్లుతో తీసుకువచ్చారు. అయితే తాడికర్ర (సిరిమానుకు ఉపయోగించే కర్ర) ఎత్తు తక్కువగా ఉండటంతో పాటు, గుజ్జుమాను కర్ర సక్రమంగా లేకపోవడంతో, సిరిమానును తయారుచేసే వడ్రంగులు అభ్యంతరం తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో యువత, రైతులు తాడికర్రను గుర్తించేందుకు మళ్లీ కొండల వైపు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం నుంచి సిరిమాను చెట్టు కోసం, అడవుల వైపు, కొండల వైపు వెళ్లగా, ఎట్టకేలకు సెల్‌ఫోన్లు సహాయంతో రాత్రి 8గంటల ప్రాంతంలో పాండవులు కొండపై సిరిమాను చెట్టును గుర్తించారు. రాత్రి 11గంటల ప్రాంతంలో గ్రామానికి తీసుకువచ్చారు.



సిరిమాను చెట్టు

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని ఆయన నివాసంలో గంట్యాడ మండలంలోని నరవ గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ పతివాడ భాస్కరావు, ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారంతా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. చేరికలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమవుతుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పాటు పడాలని కోరారు. పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సుంకరి అప్పలనాయుడు, సుంకరి భూలోకరావు, సుంకరి పైడిరాజు, సుంకరి రాము, సుంకరి సంతోష్, ఎస్.భూలోకరావు, సుంకరి అప్పలరాజు, సుంకరి భద్రినాయుడు, సుంకరి నారాయణమ్మ, కోరాడ రమణ, కోరాడ అప్పలనాయుడ, కోరాడ నారాయణరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రంధిరామునాయుడు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు నీలిమ




నీలిమను అభినందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బత్తుల నీలిమ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని కోచ్ ఆల్తి తాతబాబు చెప్పారు. గత ఏడాది నవంబర్ 4,5,6 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన అండర్-19 స్కూల్‌గేమ్స్ కబడ్డీపోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 24 నుంచి 27 వరకూ కర్నాటకలోని మాండ్యా ప్రాంతంలో జరిగే జాతీయ కబడ్డీ పోటీల్లో నీలిమ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీ కృష్ణమూర్తి, సిబ్బంది నీలిమను అభినందించి ఆమె పోటీలకు వెళ్లేందుకు గాను కొంత ఆర్థిక సహాయం అందించారు. జాతీయస్థాయిలో రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

అలుపెరగని పోరాట యోధుడు ఛత్రపతి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- సిటీబస్టాండ్ జంక్షన్‌లో శివాజీ విగ్రహావిష్కరణ

విజయనగరం: సమాజాన్ని దుర్మార్గం నుంచి సన్మార్గం వైపు నడిపించేందుకు అలుపెరగని పోరాటం చేసిన మహాయోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ఉద్ఘాటించారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌పరిధిలోని సిటీ బస్టాండ్ రోడ్డులో భావసార్ క్షత్రియ అసోసియేషన్, జిల్లా బంగారం, వెండి టెస్టింగ్, మెల్టింగ్ ఓనర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు భావసార్ క్షత్రియ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, భావసార్ క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు గోజె శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, జడే తులసీరావు, హరీష్‌కుమార్, పి.సత్యరాజ్, డాక్టర్ సుమన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఖేలో ఇండియా జాతీయ పోటీలకు ఎర్రయ్య



జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఎర్రయ్య

- 24 నుంచి చెన్నైలో వాలీబాల్ పోటీలు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగబోయే ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన బెవర ఎర్రయ్య ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అండర్-19 విభాగంలో చెన్నైలో జరగనున్న పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరుపున ఎర్రయ్య ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన ఎర్రయ్యను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గవర సూరిబాబు, కేవీఏఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.కృష్ణంరాజు, కోశాధికారి కె.సన్యాసినాయుడులు అభినందించారు. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్టలు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

కిరాణా షాపులో చోరీ

దత్తిరాజేరు: మండలంలోని పోరలి కూడలి వద్ద ఉన్న కిరాణా షాపులో ఆదివారం తెల్లవారు జామున రూ.20 వేల కిరాణా సామగ్రి చోరీ జరిగినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష తెలిపారు.షాపు యజమాని గేదెల గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

ఆర్మీ ఉద్యోగి అదృశ్యం



ఆర్మీ ఉద్యోగి గురునాయుడు

గంట్యాడ: సెలవులకు ఇంటికి వచ్చిన ఆర్మీ ఉద్యోగి ఒకరు అదృశ్యమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని నరవ గ్రామానికి చెందిన సుంకరి గురునాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవులకు గ్రామానికి వచ్చాడు. ఈనెల 3వతేదీన బెంగళూరు ఆర్మీ క్యాంప్‌కు వెళ్తానని బయల్దేరి వెళ్లాడు. అయితే అక్కడికి చేరుకున్నాడా? లేదా అని కుటుంబసభ్యులు ఫోన్ చేస్తుండగా ఫోన్ స్విచాఫ్ వస్తోంది. దీంతో తండ్రి రమణ తన కుమారుడు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ మజ్జి గణపతిరావు తెలిపారు.

వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన



ట్రాక్ పనులు పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మాణంలో ఉన్న వాకింగ్, జాగింగ్ ట్రాక్ పనులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం పరిశీలించారు. యువత, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వాకింగ్, జాగింగ్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నిధులను ఆయన గతంలో మంజూరు చేశారు. ఆ నిధులతో కళాశాల మైదానంలో పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాక్ పనులను పరిశీలించిన ఆయన పనులు ఎంతవరకు వచ్చాయో అడిగి తెలుసుకుని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని చెప్పారు. ఇక్కడ ఏర్పాటుకానున్న వాకింగ్, జాగింగ్ ట్రాక్ ఎంతో మందికి ఉపయోగపడుతుందని, యువత, విద్యార్థులు, పెద్దలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, క్రీడాకారులు, యువత ఉన్నారు.

విద్యతోనే సమాజ వికాసం

- సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కట్టిమణి



పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది



సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టిమణి

గరుగుబిల్లి: సమాజం అభివృద్ధి పథంలో నడిచేందుకు విద్య చాలా అవసరమని సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టీవీ కట్టిమణి అన్నారు. ఈ మేరకు ఆదివారం గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు-సామాజిక బాధ్యత అనే అంశంపై డా.పారినాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవడం ద్వారానే విజ్ఞానాన్ని పొందగలరని, దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడంలోనూ, ప్రజల కనీస అవసరాలను తీర్చడంలోనూ విద్య ప్రాధాన్యం చాలా ఉందన్నారు. నేటి సమాజం సామాజిక, మానసిక, ఆరోగ్య రుగ్మతలతో బలహీనమవుతోందని, వాటిన్నింటినీ అధిగమించి, ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి రసాయన ఎరువులు, పురుగు మందులు లేని, ప్రకృతి వ్యవసాయ విధానాలద్వారా పండించిన పంటలు వినియోగించడం ఒక్కటే మార్గమని సూచించారు. పంటల్లో విచక్షణా రహితంగా ఉపయోగిస్తున్న రసాయనాలు సకల జీవరాశుల మనుగడపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సమాజం వికసించాలంటే విద్యతోపాటు వ్యవసాయ విజ్ఞానం కూడా అవసరమేనని, ఉపాధ్యాయులు భావితరాలకు దిక్సూచి వంటి వారిని, వారి చేతిలో ఉన్న జ్ఞానమనే ఆయుధాన్ని సరైన పద్ధతిలో వినియోగించినప్పుడు విద్యార్థులు జ్ఞాన సంపన్నులై వికసిల్లుతారన్నారు. ఈ సందర్భంగా జట్టు ట్రస్టు, రైతు సాధికారసంస్థ రూపొందించిన ప్రాథమిక పాఠశాలలు-ప్రకృతి వ్యవసాయం పరిచయ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్ ప్రొ.ఎం.ప్రసాదరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాశ్ నారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.మహేష్, పీఎస్. ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిమ్మినాయుడి సిత్రం.!

- జబ్బర్దస్త్‌తో ప్రారంభమై సినీఫీల్డ్ వరకు ప్రయాణం



వంజరాపు సిమ్మినాయుడు

పాలకొండ రూరల్: ఎంచుకున్న రంగంలో శ్రమిస్తే ఫలితం దక్కుతుందని పాలకొండ నగర పంచాయతీ పరిధి ఎన్ కే.రాజపురానికి చెందిన వర్ధమాన సినీనటుడు వంజరాపు సిమ్మినాయుడు రుజువు చేస్తున్నాడు. ఎటువంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినప్పటికీ సినీరంగంపై తనకున్న మక్కువతో అహర్నిశలూ కష్టించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తన తండ్రి సూర్యనారాయణ రోజువారీ వేతదారు కావడం, తల్లి అచ్చయ్యమ్మ చిన్నతనంలో మరణించడంతో తాత, అమ్మమ్మ అప్పలస్వామి, చిన్నమ్మ, అత్తా మామ పాపారావు, పోలమ్మల వద్ద తమ్ముడు పోలినాయుడుతో కలిసి పెరిగాడు. ఐటీఐ పూర్తి చేసి ఒడిశాలోని ఓ ఆయిల్ కంపెనీలో, అటుపై నిర్మాణ సంస్థల్లో పనిచేస్తూ బంగ్లాదేశ్ వెళ్లి అక్కడ పవర్ ప్రాజెక్టులో చేరాడు. నటనపై మక్కువను వదులుకోలేక 2018లో హైదరాబాద్ చేరుకుని అన్నపూర్ణ స్టుడియోలో గల స్నేహితుల ద్వారా జబ్బర్దస్త్‌లో స్థానం కోసం యత్నించాడు. కమెడియన్ దొరబాబు ద్వారా జబ్బర్దస్త్‌లో అవకాశం దక్కించుకున్నాడు. రాకెట్ రాఘవ టీమ్‌లో దాదాపు 20 స్కిట్‌లు చేశాడు. అటుపై సినీ రంగంలో తనకంటూ స్థానం దక్కించుకోవాలని తీవ్రంగా శ్రమించి యాక్టర్ రచ్చ రవి పరిచయం ద్వారా సినీ అవకాశాలు పొందేందుకు అవసరమైన మెలకువలు తెలుసుకున్నాడు.



శ్రీకాంత్ హీరోగా చేసిన కోటబొమ్మాళి ఐపీస్ చిత్రంలో..

తొలి అవకాశం..

యాంకర్ సుమ ప్రధాన భూమికలో నటించిన జయమ్మ పంచాయతీ సినిమా షూటింగ్ పాలకొండ పరిసరాల్లో జరిగింది. ఆ సమయంలో వెండితెరపై కనిపించేలా ఆటోడ్రైవర్‌గా తొలి అవకాశం దక్కింది. అటుపై సేనాపతి సినిమాలో బ్యాంక్ క్యాషియర్‌గా, మ్యూజిక్ స్కూల్‌లో కానిస్టేబుల్‌గా, ఐపీఎల్ మూవీలో క్రికెటర్‌గా నటించాడు. బీమ్లా నాయక్, ఆచార్య, చాంగురే బంగారురాజా వంటి సినిమాల్లో అవకాశం దక్కించుకున్నాడు. తమిళ స్టార్ హీరో ధనుష్ నటించిన 'సార్' చిత్రంలో పేపర్‌బాయ్‌గా నటించడంతో మంచి గుర్తింపు సాధించాడు. హీరో శ్రీకాంత్ నటించిన 'కోటబొమ్మాళి ఐపీఎస్' చిత్రంలో అవకాశం వచ్చింది. దాదాపు 30 చిత్రాల్లో వచ్చిన ప్రతి అవకాశం వినియోగించుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు సిమ్మినాయుడు తెలియజేశాడు. ఇటీవల పండగ సందర్భంగా స్వగ్రామం వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడాడు. కొద్ది రోజుల్లో రిలీజ్ కానున్న శబరి, పురుషోత్తముడు, సకుటుంబయానం, అసురగణ రుద్ర, రాచరికం, వరుణ్ తేజ్ హీరో నటిస్తున్న 'మట్కా' తదితర చిత్రాల్లో అవకాశం దక్కించుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంచి నటుడిగా రాణించి స్వగ్రామానికి పేరు తీసుకువస్తానని చెబుతున్నాడు.



జయమ్మ పంచాయతీలో ఆటో డ్రైవర్‌గా నటి సుమ కనకాలతో

నేడు పాలకొండలో శోభాయాత్ర

పాలకొండ రూరల్: జగదానందకారకుడు శ్రీరాముడని హిందూ ధార్మిక సంఘ సభ్యులు పేర్కొన్నారు. అయోధ్యలో రామ జన్మభూమిలో రూపుదిద్దుకున్న మందిరంలో నిర్దేశించబడిన బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొండలో శోభాయాత్ర సోమవారం తలపెట్టారు. పట్టణంలోని విశాఖ రహదారిలో వైఎస్సార్ కూడలి సమీపంలో గల శ్రీ అభయాంజనేయ ఆలయం నుంచి సోమవారం సాయంత్రం 4 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కుల, మత, జాతి బేధాలు లేకుండా హిందువులంతా పాల్గొనాలని నిర్వాహకులు ఆదివారం కోరారు. కోటదుర్గమ్మ దేవస్థానం మీదుగా పట్టణ పురవీధుల్లో రామ నామస్మరణ తోడుగా సాగే ఈ శోభాయాత్ర విజయవంతం చేయాలన్నారు. ఇదే క్రమంలో మండలంలోని అంపిలి రామ మందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని అక్కడి ప్రజలు నిర్వహించనున్నారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా శ్రీరామ, అంజనేయ ఆలయాల్లో నేడు విశేష పూజలను భక్తులు తలపెట్టారు.